
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 11 జూలై 2025



14న మెగా జాబ్‌మేళా

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 14న మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉదయం 9గంటల నుంచి జాబ్‌మేళా జరగనుంది. శ్రీనిధి, టీపీఏ, మ్యాన్‌కైండ్ ఫార్మా, డైకిన్, తోషిబా, బంధన్ బ్యాంకు వంటి పది ప్రముఖ కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయి. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీ-ఫార్మసీ, ఐటీఐ చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య నిరుద్యోగ యువతీ యువకులు అర్హుల'ని కలెక్టర్ తెలిపారు.

పిల్లల భవిష్యత్ నిర్మాణంలో
తల్లిదండ్రులదీ కీలకపాత్ర

- నాణ్యమైన విద్య ద్వారానే వికసిత్ భారత్ సాధ్యం
- పేరెంట్స్- టీచర్స్ మీటింగ్.. విద్యావ్యవస్థలో సరికొత్త చరిత్ర
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



విద్యార్థినికి ప్రోగ్రెస్ కార్డు అందజేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పిల్లల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా కీలక భాగస్వాములు కావాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. కేంద్రమంత్రి మాట్లాడుతూ 'ఈ కార్యక్రమంలో పాల్గొనడం నాకు ఎంతో ప్రత్యేకం. గార పాఠశాలలో మా నాన్న, ప్రభుత్వ మహిళా కళాశాలలో మా అమ్మ చదువుకున్నారు. ఈ రెండు విద్యాలయాలను నేడు సందర్శించడం ఎంతో ఆనందంగా ఉంది. విద్యార్థుల భవిష్యత్ కోసం కెరీర్ కౌన్సిలింగ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. చదువు కేవలం పుస్తకాలకే పరిమితం కారాదు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం ఉంటే (మిగతా 6వ పేజీలో..)






శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన క్రీడల్లో విద్యార్థుల తల్లితండ్రుల సందడి

జనాభా వృద్ధి తగ్గుతోంది

- 14 ఏళ్లలో 4.5శాతం మాత్రమే..
- మానవవనరులకు పొంచి ఉన్న ముప్పు
- నేడు ప్రపంచ జనాభా దినం



నరసన్నపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో జనాభావృద్ధి రేటు తగ్గుతోంది. ఆలస్యంగా వివాహాలు కావడం.. ఒత్తిడి జీవన విధానాలతో పిల్లలు కనేందుకు దంపతులు అంత ఆసక్తి చూపడం లేదు. 2001 జనాభాతో పోలిస్తే 2011లో 6.52శాతం మార్పు చెందగా, ప్రస్తుత పరిస్థితి పరిశీలిస్తే జిల్లాలో జనాభా గణనీయంగా తగ్గింది. 2011 నుంచి ఇప్పటివరకూ 4.5 మాత్రమే జనాభా వృద్ధి కనిపిస్తోంది. టెక్నాలజీ పెరిగినా.. జనాభా వృద్ధి తగ్గితే రాబోయే రోజుల్లో మానవ వనరుల లభ్యత లేక ఆర్థికవ్యవస్థకు ప్రమాదం ఏర్పడవచ్చని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం ఇలాంటి సంక్షోభం చైనాలో ఉన్నందున అక్కడి ప్రభుత్వం పిల్లలను కనేవారికే ప్రోత్సాహకాలను అందిస్తోందని పేర్కొంటున్నారు. 'దేశ ఆర్థికాభివృద్ధిలో యువత పాత్ర కీలకం. ప్రస్తుతం అత్యధికంగా యువత ఉన్న మన దేశం ఆర్థికపరంగా నాల్గో స్థానంలో నిలిచింది. జిల్లాలో 2001 లెక్కల ప్రకారం మొత్తం జనాభాలో 35 శాతం నుంచి 40శాతం మేరకు యువత ఉంది. 2011 నాటికి కూడా జనాభాలో 40శాతం మేరకు యువత ఉంది. ప్రస్తుత జనాభాలో 42శాతం యువత ఉన్నా.. పిల్లలు సంఖ్య తగ్గింది. దీంతో భవిష్యత్‌లో యువత సంఖ్య కూడా తగ్గనుంద'ని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

తగ్గిన శిశువృద్ధి రేటు..

గ్రామాల్లో ఒకప్పుడు ఆరుగురు నుంచి పది మంది వరకు పిల్లలను కనేవారు. కానీ జిల్లాలో 1991 నుంచి శిశువృద్ధి రేటు తగ్గుతూ ఉంది. గతంలో జనాభా తగ్గుదలకు ప్రభుత్వాలు కుటుంబ నియంత్రణ విధానాలు అమలుచేసేవి. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలను కనే వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలకు అనర్హులుగా ప్రకటించడంతో ప్రజల్లో అవగాహన పెరిగింది. మరోవైపు అధిక జనాభాతో నిరుద్యోగం, పేదరికం, ఆహార కొరత వంటి సమస్యలు ఉంటాయని భావించి.. ప్రజలు జనాభా నియంత్రణ విధానాన్ని అవలంబించారు. ప్రస్తుతం సమాజంలో దంపతులు ఒకరిని కని సరిపెట్టుకుందామని భావిస్తున్నారు. ఉమ్మడి కుటుంబ స్థానంలో.. చిన్నకుటుంబ వ్యవస్థ నెలకొంది. ఫలితంగా జనాభావృద్ధి ప్రస్తుతం బాగా తగ్గింది. నాడు 21 ఏళ్లకు ముందే పెళ్లిళ్లు జరిగేవి. ప్రస్తుతం పురుషులకు 28-35 ఏళ్ల మధ్యలో వివాహమవుతోంది. పిల్లలను కనేందుకు చాలా మందికి ఆసక్తి సన్నగిల్లడంతో శిశువృద్ధి రేటు తక్కువగా ఉందని వైద్యనిపుణులు చెబుతున్నారు. నాటి రోజుల్లో పిల్లలను పోషించే బాధ్యత ఇంట్లో కుటుంబ పెద్దలు చూసుకునేవారు. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు లేక.. పిల్లలను సంరక్షించేవారు కరువయ్యారు. మరోవైపు ఉపాధి కోసం (మిగతా 6వ పేజీలో..)

సింహగిరి ప్రదక్షిణ చేసివస్తూ..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- మరొకరి పరిస్థితి విషమం
- కన్నీరు తెప్పించిన తల్లి రోదన
- మాకివలసలో విషాదఛాయలు



ఉదయ్‌కుమార్ (ఫైల్)

నరసన్నపేట/ భోగాపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'కొడుకా దైవ దర్శనానికి వెళ్లి వస్తానన్నావురా.. దేవుడు దగ్గరకే వెళ్లిపోయావా.. మాకు దిక్కెవరురా నాయనా, నీవే ప్రాణంగా బతుకుతున్నాంరా నాయనా, నిన్ను మరవలేమురా కొడుకా' అంటూ విజయనగరం జిల్లా భోగాపురం మండలం సుందరపేట సీహెచ్‌సీ ఆవరణలో కుమారుడి మృతదేహం వద్ద ఓ తల్లి రోదిస్తుండడం చూసిన వారంతా కన్నీరు పెట్టారు. సింహాచలంలో గిరి ప్రదక్షిణ ముగించుకుని గురువారం ఉదయం స్నేహితుడు తుర్ల చిన్నారావుతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్న రావాడ ఉదయ్‌కుమార్(28) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. చిన్నారావు గాయపడగా ప్రస్తుతం చికిత్స పొందు తున్నాడు. ఉదయ్ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించా రు. ఈ ఘటనతో ఉదయ్ స్వగ్రామం.. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం మా కివలసలో విషాదఛాయలు అలుముకున్నా యి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. మాకివలసకు చెందిన ఇద్దరు స్నేహి తులు రావాడ ఉదయ్, తుర్ల చిన్నారావు బుధ వారం ద్విచక్రవాహనంపై సింహాచలం వెళ్లా రు. అక్కడ రాత్రంతా గిరి ప్రదక్షిణ చేశారు. గురువారం ఉదయం సింహాచలంలో దైవదర్శ నం చేసుకొని ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యారు. భోగాపురం మార్కెట్ సమీపంలో (మిగతా 8వ పేజీలో..)

తప్పని నిరీక్షణ

- ఉదయం 9గంటలకే చేరుకున్న దివ్యాంగులు
- 11.15 గంటల వరకు రాని వైద్యులు
- సదరం రీవెరిఫికేషన్‌లో అవస్థలు

6వ లో

సదరం సర్టిఫికెట్ల పరిశీలనకు వెళ్లి వస్తుండగా..

- లారీ ఢీ కొని దివ్యాంగ మహిళ మృతి.. నలుగురికి గాయాలు

8వ లో

'పీ-4' వేగవంతం చేయండి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం

7వ లో

మెరిట్ ప్రాతిపదికన బదిలీలు చేపట్టాలి

- సోషల్ వెల్ఫేర్ డీడీకి వెల్ఫేర్ అసిస్టెంట్ల వినతి



ఎన్టీఆర్ బేబీకిట్లు వస్తున్నాయ్

- త్వరలో పంపిణీకి ఏర్పాట్లు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరగనున్న ప్రసవాలు

టెక్కలి రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): బాలింతలకు ఎన్టీఆర్ బేబీ కిట్లు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను పెంచే దిశగా టీడీపీ ప్రభుత్వ హయాంలో గర్భిణులకు ప్రోత్సాహక నిధులు అందజేసేవారు. అలాగే చిన్నారుల సంరక్షణకుగానూ 11 రకాల వస్తువులతో బేబీకిట్లను పంపిణీ చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2021 నుంచి బాలింతలకు బేబీకిట్ల పంపిణీని నిలిపేసింది. దీంతో బాలింతలు మార్కెట్‌లో వాటిని కొనుగోలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ నెలాఖరు నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన గర్భిణులకు బేబీకిట్లను పంపిణీ చేసేలా చర్యలు చేపడుతోంది. జిల్లాలో ప్రస్తుతం 9,206 మంది గర్భిణులు ఉన్నారు. వారందరికీ త్వరలో బేబీకిట్లను అందజేయనున్నారు. శిశువు నిద్రపోయేందుకు బెడ్, దోమతెరతోపాటు బాలింతలు చేతులు శుభ్రం చేసుకునేందుకు ద్రవణం, సబ్బు అందజేయనున్నారు. వీటితోపాటు పౌడర్, న్యాప్‌కిన్, రెండు తువ్వాళ్లు, చిన్నబొమ్మ తదితర 11 రకాల వస్తువులను ఇవ్వనున్నారు. వీటి విలువ మార్కెట్‌లో రూ.1,410 వరకు ఉంటుంది. ఇప్పటికే డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌ఎస్, జీజీహెచ్‌లకు రెండేళ్లపాటు కాంట్రాక్ట్ పద్ధతిలో కిట్లు సరఫరాకు టెండర్లు పిలిచారు. ఈ బాధ్యతను ఏపీ వైద్యసేవలు మౌలిక వసతుల అభివృద్ధి సంస్థకు అప్పగించారు. బేబీకిట్లు పంపిణీ చేస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.



కుడి కాలువ ద్వారా ప్రవహిస్తున్న సాగునీరు

'వంశధార' నీరు విడుదల

హిరమండలం, జూలై 10: హిరమండలంలోని గొట్టాబ్యారేజీ వద్ద వంశధార కుడి ప్రధాన కాలువ ద్వారా గురువారం సాగునీటిని విడిచిపెట్టారు. ముందుగా 119 క్యూ సెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారు. క్రమేపీ నీటి విడుదల పెంచుతామని వంశధార డీఈఈ సరస్వతి తెలిపారు. హిరమండలం, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, బూర్జ, శ్రీకాకుళం రూరల్ మండలాల పరిధిలో 84వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఎడమ కాలువ ద్వారా 680 క్యూసెక్కులను విడిచిపెడుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వంశధార నదిలో 3,900 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. 2,800 క్యూసెక్కుల నీటిని బ్యారేజీ దిగువకు విడిచిపెడుతున్నారు.

గృహ హక్కు.. లేదు నగదూ

- వైసీపీ హయాంలో ఓటీఎస్ పేరిట మోసం
- శాశ్వత హక్కు అంటూ డబ్బుల వసూలు
- నాలుగేళ్లు అవుతున్నా అతీగతీ లేని వైనం
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



ఇచ్ఛాపురంలో ఓటీస్ ధ్రువపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు (ఫైల్)

ఇచ్ఛాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గృహ నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఇళ్ల మంజూరుకు చర్యలు చేపడుతోంది. అయితే వైసీపీ హయాంలో ఇల్లు, ఇళ్ల పట్టా మంజూరైందని చూపుతూ చాలామంది దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. మరోవైపు వైసీపీ హయాంలో రూ.10వేలు కట్టిన చాలామంది లబ్ధిదారులు ఓటీఎస్ (వన్‌టైమ్ సెటిల్‌మెంట్) పత్రం కోసం ఇప్పటికీ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఎప్పుడో ఎన్టీఆర్ హయాం నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం వరకూ గృహ నిర్మాణ పథకంలో భాగంగా మంజూరైన ఇళ్లకు వైసీపీ సర్కారు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం తీసుకొచ్చింది. దశాబ్దాల కిందట నిర్మించిన ఇళ్లకు కొలతలు తీసి సంపూర్ణ గృహ హక్కు కల్పిస్తామని అధికారులు నమ్మబలికారు. చాలామంది వద్ద డబ్బులు కట్టించుకున్నారు. ఇది జరిగి నాలుగేళ్లు గడుస్తున్నా దానికి సంబంధించి సంపూర్ణ గృహహక్కు పత్రాలు ఇంత వరకూ మంజూరు చేయలేదు. తమ (మిగతా 8వ పేజీలో..)

వేడుకగా గురుపౌర్ణమి



బొందిలీపురంలోని తిరువీధిలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. సాయి నామస్మరణ మార్మోగింది. జిల్లాలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం వేకువజాము నుంచే సాయిబాబా ఆలయాల వద్ద భక్తులు బారులుదీరారు. బొందిలీపురంలోని దర్బార్ షిరిడీ ఆలయంలో పత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బాబాను స్వర్ణ కిరీటధారణతో అలంకరించారు. బొందిలీపురం నుంచి ఇలిసిపురం వరకూ కోలాటం, తప్పెటగుళ్లు, విచిత్ర వేషధారణల నడుమ తిరువీధి నిర్వహించారు. తిరువీధిలో సాయి నామస్మరణ చేస్తూ.. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న వేషధారణలు



శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రోగ్రెస్ కార్డులతో విద్యార్థినులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యప్రదర్శనలు





పొందూరు: విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న రవికుమార్

'నాడు-నేడు'పై సమగ్ర విచారణ..

పొందూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నాడు-నేడు పథకం వైసీపీ నేతలకు కల్పవృక్షంగా మారిందని, ఈ పథకంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణ జరపబోతుందని పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ చెప్పారు. గురువారం మండలంలోని తండ్యాం జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వపాఠశాలల్లో కార్పొరేటు విద్యాసంస్థలస్థాయిలో సౌకర్యాలు కల్పించామని గొప్పలు చెప్పుకున్నా, విద్యాబోధన గాలికి వదిలేసిందని విమర్శించారు. అవినీతికి పాల్పడినవారికి శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జి.రఘునాథ్, తహసీల్దార్ ఆర్. వెంకటేష్, ఎంపీడీవో మన్మథరావు, గ్రామసర్పంచ్ కె.భాస్కరరావు, ఎంఈవోలు జి. శ్రీరాములు, పి. రాజారావు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేస్తాం: విప్

ఇచ్ఛాపురం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు పూర్తి స్థాయిలో బలోపేతం చేసి విద్యకు పెద్దపీట వేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ప్రభుత్వవిప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. ఇచ్ఛాపురంలోని బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం బల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఏడాది కాలంలో ప్రభుత్వ పాఠశాలలను ఎంతోగానో అభివృద్ధిచేశామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నాటకలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, ఎస్ఎంసీ చైర్మన్ గిన్ని చిన్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాలిన డిల్లీ, కమిషనర్ ఎన్.రమేష్, ఎంపీడీవో రామారావు పాల్గొన్నారు. ఈదుపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తల్లుల్ల కాళ్ల కడిగి పాదాభివందనం చేశారు.



పైడిభీమవరం హైస్కూల్ విద్యార్థులకు ప్రోత్సాహకం అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఆశయసాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలి: ఎంపీ

రణస్థలం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) :తల్లిదండ్రుల ఆశయసాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. పైడిభీమవరం జడ్పీ హైస్కూల్లో మెగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదవిద్యార్థుల అభివృద్ధికి మంత్రి లోకేష్‌బాబు కృషి చేస్తున్నారని తెలిపారు. పదోతరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు లంక శ్యామలరావు, జగన్నాథంనాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, సర్పంచ్ సింకు భవాని, రౌతు శ్రీనివాసరావు, వడ్డాది శ్రీనివాసరావు, హెచ్ఎం శోభారాణి పాల్గొన్నారు.

అర్హులందరికీ తల్లికి వందనం..

నరసన్నపేట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ చదివే విద్యార్థులకు తల్లికివందనం పథకం వర్తిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.పవన్‌కుమార్, బగ్గు అర్చన, గొద్దు చిట్టిబాబు, సాసుపల్లి కృష్ణబాబు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వేడుకగా సమావేశాలు..

పోలాకి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మబగాంలో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని తన మనుమడితో కలిసి ఫొటోఫ్రేమ్‌లోకి చేరి ఆనందం పొందారు. కేజీబీవీ, ప్రియాగ్రహారం, ఈదులవలస మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించారు.

విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యం..

జలుమూరు(సారవకోట): విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సారవకోట మండలం బుడితి ఉన్నత పాఠశాలల్లో గురువారం నిర్వహించిన పేరెంట్స్-టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలు భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమకంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఎంఈవోలు బి.మాధవరావు, ప్రసాదరావు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులకు శ్రీకారం..

పాతపట్నం/హిరమండలం, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రం పాతపట్నంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు హిరమండలం మండలం అవలంగి గ్రామంలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలకతీతంగా విద్యార్థుల ఉన్నత భవితకై సమగ్ర మార్పులు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకువస్తున్నారన్నారు.



జలుమూరు: దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఈ సందర్భంగా విద్యార్థినులు సాంస్కృతికి ప్రదర్శనపలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జడ్పీ సీఈవో డీఎస్‌వీ శ్రీధర్‌రాజా, హెచ్ఎం ఎస్.వైకుంఠరావు, తహసీల్దార్ ఎన్.ప్రసాదరావు, ఎంపీడీవో పి.చంద్రకుమారి, హిరమండలం జడ్పీటసీ పి.బుచ్చిబాబు, ఎంపీడీవో కాశీప్రసాదరావు, తహసీల్దార్ హనుమంతురావు, ఎంఈవో కె.రాంబాబు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పాతపట్నం: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



గారలో సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రం అందజేస్తున్న రామ్మోహన్‌నాయుడు, శంకర్

నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

గార, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. గురువారం గారలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన విజయవంతంగా ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ధైర్యంగా ప్రజలు ముందుకొచ్చి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏడాదిలో తాము చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే గార జడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ పాల్గొని విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకుడు రామకృష్ణ, వంశధార ప్రాజెక్టు చైర్మన్ అరవల రవీంద్ర, డీఈవో తిరుమల చైతన్య పాల్గొన్నారు. అనంతరం గార వద్ద వంశధార నదిపై నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకం పనులను రామ్మోహన్ నాయుడు, శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం పనులను పూర్తిచేసి ప్రస్తుత ఖరీఫ్‌కి నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

తప్పని నిరీక్షణ

- ఉదయం 9 గంటలకే చేరుకున్న దివ్యాంగులు
- 11.15 గంటల వరకు రాని వైద్యులు
- సదరం రీవెరిఫికేషన్‌లో అవస్థలు



● ఈ చిత్రంలో ఉన్న దివ్యాంగురాలు.. సారవకోట మండలం ధర్మలక్ష్మీపురం పంచాయతీ ఎం. కొత్తూరు గ్రామానికి చెందిన జి.చిన్నమ్మి. సదరం రీవెరిఫికేషన్ కోసం ఉదయం 9 గంటలకు ఆసుపత్రికి చేరుకుంది. సరిగా కూర్చొలేని పరిస్థితి.. స్టక్చర్‌పైన మూడు గంటలు కూర్చొని చాలా ఇబ్బందికి గురైయింది. డాక్టర్ల కోసం కళ్లకు కాయలు కాచేలా ఎదురుచూస్తుంది.



● ఈ చిత్రంలో ఉన్న దివ్యాంగుడు సారవకోట మండలం బద్రి గ్రామానికి చెందిన జనార్దన రావు. ఆసుపత్రి బయట నేలపై డాక్టర్ల కోసం ఎదురుచూస్తున్నాడు. ఉదయం నుంచి ఆర్థో వైద్యులు రాకపోవడంతో అలాగే ఉదయం 11.30 గంటల వరకు కూర్చొన చోట కదలకుండా నిరీక్షించాడు.

నరసన్నపేట, జూలై 10(ఆంధ్రజ్యోతి):

ఇదీ స్థానిక ఏరియా ఆసుపత్రిలో సదరం రీవెరిఫికేషన్‌కు వచ్చిన దివ్యాంగుల పరిస్థితి. బుధ, గురువారాల్లో సారవకోట మండలానికి చెందిన దివ్యాంగులకు సదరం రీవెరిఫికేషన్‌కు శాట్లు కేటాయించారు. బుధవారం 50 మంది దివ్యాంగులు రాగా.. మధ్యాహ్నం 12 గంటల వరకు దివ్యాంగులను పరీక్షలను నిర్ధారించే వైద్యులు హాజరు కాలేదు.. అదే మాదిరిగా గురువారం 11.30 వరకు రాకపోవడంతో ఉదయం తొమ్మిది గంటలు నుంచి సరిగా కూర్చొలేక.. నిల్చొలేక అవస్థలు పడ్డారు. గురువారం సారవకోట మండలం సుదూర ప్రాంతాలు నుంచి వచ్చిన దివ్యాంగులకు పరీక్షలు పూర్తయ్యేసరికి 2గంటలు సమయం పట్టింది. దింతో ఆకలి, దప్పికలతో అవస్థలు పడ్డారు. దివ్యాంగులపై కనికారం లేకుండా వైద్యులు ఇలా వ్యవహారించడంపై పలువురు విమర్శిస్తున్నారు. కొందరు వైద్యులు విధులకు వచ్చినట్లు హాజరై క్లినిక్‌లకు వెళ్లడంతో ఇలా జరుగుతుందని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా వీటిని నిర్మూలించి ఆసుపత్రి సమయంలో విధుల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుచున్నారు. కాగా ఈ సదరం శిబిరంలో పాల్గొని తిరిగి ఆటోపై వెళ్లిన దివ్యాంగులు సారవకోట మండలం కిట్టాలపాడు వద్ద లారీ ఢీకొనడంతో ప్రమాదానికి గురయ్యారు. దీంతో కొంతమంది దివ్యాంగులు గాయపడ్డారు. సకాలంలో వైద్యులు వచ్చుంటే ఈ ప్రమాదం తప్పేదేమోనని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంపై సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసబాబు వద్ద ప్రస్తవించగా.. సదరం రీవెరిఫికేషన్‌కు వచ్చే వైద్యులు ఇతర ప్రాంతాలు నుంచి రావడం వల్ల కొంచెం ఆలస్యం అవుతుందన్నారు.



ఏరియా ఆసుపత్రిలో ఆర్థోవైద్యుల కోసం నిరీక్షిస్తున్న దివ్యాంగులు

జనాభా వృద్ధి తగ్గుతోంది

(ఐదో పేజీ తరువాయి)

గ్రామాలు నుంచి పట్టణాలకు తరలివెళ్లడం.. వివాహం, కుటుంబ వ్యవస్థల్లో కూడా మార్పులు రావడం జనాభావృద్ధికి ఆటంకంగా మారింది.

ఆర్థికాభివృద్ధికి మానవ వనరులే కీలకం..



దేశ ఆర్థికవ్యవస్థకు మూలం మానవ వనరులే. మానవ వనరులు కొరత ఏర్పడితే.. ఆర్థిక మాంద్యం ఏర్పడే ప్రమాదం ఉంది. అందుకే మళ్లీ ప్రభుత్వాలు జనాభా వృద్ధికి కోసం ప్రకటనలు చేస్తున్నాయి. సాంకేతిక ఎంత అభివృద్ధి చెందినా.. మానవ వనరులు లేకుండా నిరర్థకం అవుతుంది.

-సత్యనారాయణ, అర్థశాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల

అప్పట్లో ఎక్కువ మందిని కనేవారు..



నాకు ఎనిమిది మంది పిల్లలు. మా రోజుల్లో శిశుమరణాలు ఎక్కువగా ఉండేవి. ఆ భయంతో ఎక్కువ మందిని కనేవారు. మగబిడ్డ కోసం ఎన్ని కాన్పులైనా ఎదురుచూసేవాళ్లం. ప్రస్తుతం ఆసుపత్రులు పెరిగాయి. శిశుమరణాలు తగ్గాయి.

-వెలమల నీలమ్మ, జమ్ము

అప్పటి సమస్యలు లేవు..



ఆహారం, వైద్య సదుపాయాలపై ప్రస్తుత రోజుల్లో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జనాభా పెరిగితే నిరుద్యోగం, ఆహారం వంటి సమస్యలు ఏర్పడతాయనే భయం కొందరిలో ఉండేది. నేడు సాంకేతికత పెరిగింది. అధిక దిగుబడి పంటలు పండిస్తున్నాం. వైద్య సదుపాయాలు పెరిగాయి. సమాచార వ్యవస్థలో మార్పులతో సమస్యలను సులభంగా పరిష్కరించవచ్చును. అయితే ప్రజలకు కష్టపడే తత్వం ఉండాలి. అది లేకుంటే అధిక జనాభాతో అనర్థమే.

-జ్యోతి ఫ్రెడరిక్, గణాంక నిపుణులు, రిటైర్డు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

శిశువృద్ధి రేటు తగ్గుతోంది..



వైద్య సదుపాయాలు పెరిగినా.. ఇద్దరి కంటే ఎక్కువ బిడ్డలను కనేందుకు చాలామంది దంపతులు ఆసక్తిచూపడం లేదు. కుటుంబ నియంత్రణపై భాగా అవగాహన పెరిగింది. యాంత్రీకరణ జీవన విధానంతో పిల్లలను సరిగా చూసుకోలేమనే భావన కూడా ఉండటంతో శిశువృద్ధి తగ్గుతోంది.

-ఆర్.సంధ్యారాణి, గైనకాలజిస్టు, నరసన్నపేట

పిల్లల భవిష్యత్ నిర్మాణంలో తల్లిదండ్రులదీ కీలకపాత్ర

(ఐదో పేజీ తరువాయి)

మంచి విజయాలు సాధించవచ్చు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడం ద్వారానే వికసిత్ ఆంధ్ర, స్వర్ణాంధ్ర నిర్మాణం సాధ్యమవుతుంది. ఈ దిశగా మంత్రి లోకేశ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పిల్లల కోసం తల్లిదండ్రులు సమయాన్ని వెచ్చించి.. నాణ్యమైన విద్యనందించాలి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ విద్యార్థీ ఒక మొక్కను నాటి సంరక్షించాల'ని తెలిపారు. 'ఏడాదిలోగా కళాశాలలో సమస్యలను పరిష్కరించి.. అద్భుతంగా తీర్చిదిద్దుతాం. ఆర్వోప్లాంటు ప్రారంభిస్తాం. ప్రతీ కళాశాలకు ఒక క్రీడామైదానం ఉండేలా చర్యలు తీసుకుంటామ'ని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

● ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ 'పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. నేటి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలు. తల్లిదండ్రులు- ఉపాధ్యాయులు-విద్యార్థుల మధ్య సమన్వయం అనేది ఒక కొత్త చరిత్రకు నాంది. గొప్ప సమాజ నిర్మాణానికి ముందడుగు' అని తెలిపారు.

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ 'పిల్లలు డ్రగ్స్, గంజాయి. చెడు స్నేహాలు, సోషల్ మీడియా బారిన పడి జీవితాలను నాశనం చేసుకోకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్న వయసులో పెళ్లిళ్లు, గర్భధారణ చాలా అనర్థాలకు దారి తీస్తుంది. ఈ విషయాలపై అప్రమత్తంగా ఉండాల'ని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు క్రీడల పోటీలు నిర్వహించారు. బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. కోలాటం, సాంస్కృతిక నృత్యప్రదర్శనలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీఎంజే బాబు, మాదారపు వెంకటేష్, కొమ్మనాపల్లి వెంకటరామరాజు, కవ్వాడి సుశీల, అరవల రవీంద్ర, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగాయి..

'వైసీపీ పాలనలో ప్రభుత్వ విద్య సర్వనాశనమైంది. కూటమి వచ్చిన ఏడాదిలోనే ప్రభుత్వ పాఠశాలల్లో 15శాతం వరకు అడ్మిషన్లు పెరిగాయ'ని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 'సులభమైన పదాలతో నూతన సిలబస్‌ను తయారు చేసి విద్యార్థులకు అందించాం. ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందజేస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన పుస్తకాలు, బ్యాగులు, కిట్లు అందజేశాం. గత ప్రభుత్వం పుస్తకాలు, బ్యాగులపై ఫొటోలను ముద్రించి పబ్లిసిటీ కోసం వాడుకుంది. మేం అందుకు పూర్తి భిన్నం. ఇచ్చిన మాట ప్రకారం విద్యార్థులందరికీ 'తల్లికి వందనం' పథకం అమలుచేశాం. ప్రభుత్వం విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కట్టుబడి ఉంద'ని తెలిపారు.



పలాస: అలంకరణలో షిర్డీసాయి



శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరాలయంలో షిర్డీ సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

జిల్లాలోని షిర్డీసాయి మందిరాల్లో గురుపౌర్ణమి (వ్యాస పౌర్ణమి) వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. బాబాకు పట్టు వస్త్రాలు, పువ్వులతో అలంకరించి విగ్రహంతో తిరువీధి నిర్వహించారు. మందిరాల ప్రాంగణాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం



కవిటి: జాడుపూడి ఆర్ఎస్‌లో..



హిరమండలం: పాలభిషేకం చేస్తున్న అర్చకులు



ఇచ్ఛాపురం: బాబా విగ్రహంతో తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు

‘పీ-4’ వేగవంతం చేయాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ-ప్రైవేటు-ప్రజల భాగస్వామ్యం(పీ-4) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు.బంగారు కుటుంబాలను మార్గదర్శులతో అనుసంధానంచేసే ప్రక్రియపై దృష్టిసారించాలని కోరారు. గురువారం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీ-4 కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని, ఆగస్టు 15 నాటికి 15లక్షల కుటుంబాలను మార్గదర్శులకు అనుసంధానంచేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు.లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు.ప్రతీవారం ప్రధానకార్యదర్శి ఈ కార్యక్రమాన్ని సమీక్షిస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి కనీసం 3000 కుటుంబాలను మార్గదర్శులకు అనుసంధానించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.417 కోట్లతో అభివృద్ధి పనులు

● జిల్లా సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ శశిభూషణ్‌రావు

లావేరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మనబడి-మన భవిష్యత్ పథకంలో భాగంగా రెండో విడత రూ.417 కోట్లతో పాఠశాలల అదనపు గదులు, ప్రహరీలు, మరుగుదొడ్లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జిల్లా సమగ్రశిక్షాఅభియాన్ ఏపీసీ సంపతిరావు శశిభూషణ్ రావు తెలిపారు. గురువారం మండలంలోని మురపాక కేజీబీవీలో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.253 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 25 కేజీబీవీలకుగాను 20 కేజీబీవీల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి కేజీబీవీలో ఆరు నుంచి ఇంటర్ వరకు 280సీట్లు వరకు ఉంటాయని చెప్పారు.ప్రైవేటుకు దీటుగా బోధిస్తున్నట్లు తెలిపారు.కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు నెలకు రూ.1600 చొప్పున మెస్ చార్జీల కింద ప్రభుత్వం ఖర్చు చేస్తోందని చెప్పారు. కార్య క్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ డీఈ ఉమామహేశ్వరి, ఏఈ రాజేష్, మురపాక కేజీబీవీ ప్రత్యేకాధికారి బల్ల సుధ పాల్గొన్నారు.

ప్రభుత్వానివి మోసపూరిత హామీలు

జి.సిగడాం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో గెలవాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇచ్చి అవి అమలు చేయలేక ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ విమర్శించారు. గురువారం జి.సిగడాంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ పై మండల స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల సత్యవతి, జడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, నాయకులు డోల వెంకట రమణ, పేడాడ శ్రీరామమూర్తి పాల్గొన్నారు

మెరిట్ ప్రాతిపదికన బదిలీలు చేయాలి

● సోషల్ వెల్ఫేర్ డీడీకి సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్ల వినతి

శ్రీకాకుళంకలెక్టరేట్, జూలై 10(ఆంధ్రజ్యోతి):నిబంధనలకు అనుగుణంగా, మెరిట్ ప్రాతపదికన బదిలీలు నిర్వహించాలని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు కోరారు. గతనెల 30న శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో వెల్ఫేర్ అసిస్టెంట్లకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం విదితమే. మెడికల్,స్పౌజ్, మెరిట్ ఆధారంగా బదిలీలుచేస్తున్నట్లు ప్రకటించారు. బదిలీలు పూర్తిచేసిన నేపథ్యంలో నిబంధనలకు తిలోదకాలిచ్చి తమకు అన్యాయంచేశారని గురువారం కలెక్టరేట్‌లోని సోషల్‌వెల్ఫేర్ డీడీకి వినతిపత్రాలను అందజేశారు.ఈసందర్భంగా మాట్లాడుతూ రేషనలైజేషన్ పూర్తయిన తర్వాతే బదిలీలు చేపట్టాలని ఇదివరకే మంత్రులకు పలుసార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు.అయినా బదిలీలు నిర్వహించడంలో గందరగోళం నెలకొందని చెప్పారు. తలసముద్రం, కొమనాపల్లి సచివాలయాలకు ఇద్దరేసి చొప్పున నియమించారని, ఇదిఅధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వాపోతున్నారు. ఇప్పటికైనా మెరిట్ ప్రాతిపదికన, నిబంధనలకు అనుగుణంగా బదిలీలు నిర్వహించి న్యాయం చేయాలని వారు కోరారు.


వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

రణస్థలం, జూలై 10(ఆంధ్రజ్యోతి):సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న వేధింపులపై ఉద్యోగినులు అప్రమత్తంగాఉండాలని డీఎస్పీ సీహెచ్ వివేకానంద పేర్కొన్నారు.గురువారం పైడిభీమవరం రెడ్డీస్ లేబరేటరీ పరిశ్రమల్లో నారీశక్తి కార్యక్రమంపై ఉద్యోగినులకు అవగాహన కల్పించారు.మహిళా భద్రత,దాడులు, గృహహింస,సోషల్‌మీడియా వేదికగా జరుగుతున్న వేధింపులు, శక్తియాప్ ఉపయోగం, మహిళరక్షణకుగల చట్టాలు, సురక్ష క్యూఆర్ కోడ్‌పై వివరించారు. మహిళ సురక్షిత ప్రయాణం కోసం ఆటోలకు సురక్ష క్యూఆర్ కోడ్ యాప్ అందుబాటులోకి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఇటీవల తీసుకొచ్చారని వివరించారు.ఆటోలో ప్రయాణం చేసే సమయంలో ఎటువంటి ఆపదవచ్చినా మహిళలు క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఆటో డ్రైవర్ పూర్తివివరాలు తెలుస్తాయని వివరిచారు. కార్యక్రమంలో జేఆర్ పురం సీఐ అవతారం, ఎస్ఐ ఎస్ చిరంజీవి పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో తనిఖీలు

ఆమదాలవలస, జూలై 10 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ కెమెరాలతో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు విస్తృత తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ ఎస్.బాలరాజు తెలిపారు. గురువారం ఆమదాలవలస పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డీఎస్పీ వివేకానంద స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో 20 ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచినట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లో కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందని చెప్పారు. అటువంటి వారిపై ఈ డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేసి గుర్తించిన వెంటనే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, మాదకద్రవ్యాలు, పేకాట స్థావరాలకు దూరంగా ఉండాలని కోరారు.నేరచరిత్రగల కొందరిప్రోద్బలంతో అటువంటి కార్య క్రమాలకు పూనుకొని యువకులు జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలిపారు.

కాంట్రాక్ట్ ఫ్యాకల్టీగా గుర్తించాలి



బాలాజీకి వినతిపత్రం అందజేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ

ఎచ్చెర్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : తమను కాంట్రాక్ట్ ఫ్యాకల్టీగా గుర్తించాలని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ రెడ్డి లక్ష్మంనాయుడు, వై.నారాయణరావు, పి.నవీన్ కోరారు. ఈ మేరకు ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీకి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో రాత పరీక్ష ఇంటర్వ్యూ, కాంట్రాక్ట్ నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన గెస్ట్ ఫ్యాకల్టీకి రిజర్వేషన్ ఇచ్చి తీరని అన్యాయం చేశారని తెలిపారు. 2018 సంవత్సరం తరువాత గెస్ట్ ఫ్యాకల్టీగా చేరిన వారందరికీ రూ.40 వేల వరకూ వేతనాలు పెంచి తమకు రూ.25 వేలకే పరిమితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు దఫాలు సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసికెళ్లినా న్యాయం జరగలేదని వాపోయారు.



బోరు చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

నిర్వహణ లేక.. తాగు నీరందక

●ఇదీ గంగివలస పాఠశాల వద్ద చేతిపంపు పరిస్థితి

పోలాకి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గంగివలస పంచాయతీ పరిధిలోగల ప్రాథమికపాఠశాల వద్ద ఏర్పాటుచేసిన చేతిపంపు నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో తాగు నీటికోసం విద్యార్థులు అగచాట్లకు గురవుతున్నారు. ఇక్కడ 40 మంది విద్యార్థులు చదువుతున్నారు.పాఠశాల ఆవరణలో బోరు పనిచేయకపోవడంతో వీరంతా తాగునీటిని ఇళ్ల నుంచి తీసుకు రావల్సివస్తోంది. వినియోగంలో లేకపోవడంతో బోరు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో ఆ పరిసరాల్లో విషజంతువులు సంచరించే అవకాశముందని విద్యార్థులు అటు వైపు వెళ్లడానికి భయాందోళన చెందుతున్నారు. ఆరు నెలల కిందట బోరు పాడైనా కనీస మరమ్మతులు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.లక్షలాది రూపాయల ప్రజాధనంతో ఏర్పాటుచేసిన బోరు ఎక్కువ రోజులు వినియోగించకపోతే తుప్పుపట్టి పాడయ్యే అవకాశముందని పలువురు చెబుతున్నారు. గతంలో సమీపంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థినులతోపాటు పరిసరప్రాంతాల్లో నివాసముండే వారి తాగు నీటి అవసరాలనుఈ బోరు తీర్చేది. తక్షణమే అధికారులు స్పందించి బోరు మరమ్మతులు చేయడంతోపాటు చుట్టూఉన్న పిచ్చిమొక్కలు తొలగించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

తల్లిదండ్రుల సహాయంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య

●జిల్లావ్యాప్తంగా మెగా పేరెంట్స్ మీటింగ్



కవిటి: జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు



ఇచ్ఛాపురం: ప్రభుత్వోన్నత పాఠశాలలో కుర్చీ ఆట ఆడుతున్న విద్యార్థుల తల్లులు

తల్లిదండ్రుల సహాయంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే అవకాశం ఉంటుందని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటుపాఠశాలలు, జూనియర్‌కళాశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు.ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందజేస్తున్న సౌకర్యాలను వివరించారు.తొలుత విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డుల వివరాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులు తల్లిదండ్రుల పాదాలకు పూజలుచేశారు. తల్లిదండ్రుల కోసం రంగవల్లుల పోటీ, టగ్ఆఫ్ వార్, మ్యూజికల్‌చైర్ తదితర ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటకలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులతో మొక్కలు నాటించారు. పలు పాఠశాలల ఆవరణలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేశారు.పాఠశాల ఆవరణల్లో ఏర్పాటుచేసిన సెల్ఫీ స్టాండ్ వద్ద పేరెంట్స్‌తో విద్యార్థులు ఫోటోలు దిగారు. (ఆంధ్రజ్యోతి బృందం)



టెక్కలి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...



హరిపురం: బేతాళపురం హైస్కూల్‌లో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



వజ్రపుకొత్తూరు: పల్లిసారథి హైస్కూల్‌లో..



గుజరాతీపేట: పీఎస్ఎన్ఎం హైస్కూల్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు



కోటబొమ్మాళి: పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి



పలాస: ప్రభుత్వోన్నత పాఠశాలలో..



ఎల్ఎన్‌పేట: కేజీబీవీ పాఠశాలలో...



నరసన్నపేట రూరల్: సుందరాపురం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

●జిల్లాలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు

ప్రజా సంక్షేమమే ధ్యేయమని టీడీపీ నాయకులు తెలిపారు. గురువారం జిల్లాలో సుపరిపాలనలో తొలి అడుగుకార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీచేసి పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదోనని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలకు సంబంధించిన వినతులను ప్రజల నుంచి తీసుకున్నారు.

●పొందూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న అపూర్వస్పందన కూటమి ప్రభుత్వం తొలిఏడాది అందించిన పాలనకు నిదర్శనమని పీయూసీ చైర్మన్,ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు.మండలంలోని లోలుగులో నిర్వహించిన తొలిఅడుగు కార్యక్రమంలో మాట్లాడుతూ సంక్షేమమే కాకుండా రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని చెప్పారు. పార్టీ జెండా చూడకుండా అర్హులందరికీ సంక్షేమం అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయమన్నారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నవీ లేనివి అడిగితెలుసుకున్నారు. తక్షణమే సాంకేతిక సమస్యలు పరిష్కరించి అర్హులైనవారందరికీ పథకాలు వర్తింపజేసేలా చూడాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులమీద ఉందని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, నాయకులు తాడిబోయిన చంద్రశేఖరరావు, టీడీపీ మండలాధ్యక్షులు సీహెచ్ రామ్మోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ అన్నెపు రాము, తెలుగు యువత జిల్లా ప్రధానకార్య దర్శి బలగ శంకరభాస్కర్, బాడాన గిరి, పీఏసీఎస్ అధ్యక్షుడు వండాన మురళి పాల్గొన్నారు.

●జి.సిగడాం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులవలస, పెంట, జి.సిగడాం, గేదెలపేట తదితర గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కుమరాపు రవికుమార్, నాయ కులు పడాల అప్పన్న, మజ్జి కన్నంనాయుడు, బాలబొమ్మ వెంకటేశ్వరరావు, అంపోలు ఈశ్వరరావు, పలిశెట్టి సూర్యనారాయణ, డబ్బాడ ఆదినారాయణ పాల్గొన్నారు.



పొందూరు: సుపరిపాలనలో తొలిఅడుగు కరపత్రం అందజేస్తున్న రవికుమార్



కొత్తూరు: బలదలో కరపత్రాల ద్వారా ప్రభుత్వపథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

●నందిగాం, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరుభద్ర పంచాయతీ కంచిపూరు, కామదేనువుల్లో రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శి మెట్ట పద్మావతి ఆధ్వర్యంలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు.

●కొత్తూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులను ఇంటింటికి వెళ్లి వివరించడమే సుపరిపాలనలో తొలి అడుగు ముఖ్య ఉద్దేశమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. కొత్తూరు మండలంలోని బలదలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వాహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అందుతున్నది లేనిది ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్పీ పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో మెరుగైన విద్యనందించాలన్న లక్ష్యంతో యూపీపాఠశాలను అప్‌గ్రేడ్ చేయించేందుకు కృషి చేశానని తెలిపారు.గ్రామంలో రేషన్‌షాపు దూరంగా ఉండడం వల్ల రేషన్ తీసుకునేందుకు, పద్మనాభసాగరం ఆక్రమణకు గురవడంతో సాగునీటికి, ఆంధ్రా-ఒడిశా సరిహద్దులను కలిపే సీతాపురం నుంచి కిడిగాం వరకు రహదారి సక్రమం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడవల్సి వస్తోంది గ్రామస్థులు ఎమ్మెల్యేకు వివరించారు.దీంతో స్పందించిన ఆయన ప్రధానరహదారికి రూ.20 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, అన్నిసమస్యల పరిష్కారంకృషి చేస్తానని హామీఇచ్చారు.సాగునీరందించాలన్న లక్ష్యంతో మాతల, కడుము ఎత్తిపోతల పథకాలు నిర్వహణకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు అగతముడి మాధవరావు, కార్యదర్శి అరుబోలు దశరథరావు,మండల పరిషత్ ఉపాధ్యక్షులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, మాతలగాంధీ, అగతముడి అరుణకుమార్, పడాల లక్ష్మణరావు, వలురౌతు సుధాకరావు, కుంచాల నూకరాజు పాల్గొన్నారు.

మెగా పీటీఎం నిర్వహణపై ఫిర్యాదు

పొందూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్(పీటీఎం) నిర్వహణలో లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య నిర్లక్ష్యం, అలసత్వంపై ఎమ్మెల్యే రవికుమార్, అధికారులకు ఫిర్యాదుచేసినట్లు కేజీబీవీ పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు కిరణ్, ఉపాధ్యక్షులు పారన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.తల్లిదండ్రులుచేసిన సంతకాల రిజిస్టర్‌ను సైతం చూపలేదని పేర్కొన్నారు.పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యంపై ఇప్పటికే ఫిర్యాదుచేశామని తెలిపారు. కనీసం మెగా పీటీఎం నిర్వహణపై సైతం నిర్లక్ష్యం ప్రదర్శించారని పేర్కొన్నారు. త్వరలో విద్యాశాఖామంత్రికి ఫిర్యాదుచేస్తామని పేర్కొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 13వ తేదీన జరగనున్న మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపికచేశారు. ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో గురువారం ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు కె.గౌరీశంకర్, రాజే, దుమ్ము అప్పన్న, విజయ్‌కుమార్‌తోపాటు ఎంపికైన క్రీడాకారులు పాల్గొన్నారు.

అలరించిన మార్కండేయుడు చరిత్ర హరికథ

శ్రీకాకుళంకల్చరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి):స్థానిక బాపూజీ కళా మందిర్‌లో సుమిత్రకళాసమితి ఆధ్వర్యంలో హరికథభాగవతార్ రవి ప్రసాద్ ప్రదర్శించిన మార్కండేయుడు చరిత్ర హరికథ అలరించింది. కార్యక్రమంలో సుమిత్ర కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకర్ శర్మ, కొంక్యాన మురళి, పీఎంజీ బాబు,శంకరరావు, గుత్తు చిన్నారావు, సురేష్ పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకు సాగునీరేదీ?

- అవకాశం ఉన్నా నిర్లక్ష్యం
- పాడైన భూగర్భ పైప్‌లైన్లు
- గత వైసీపీ పాలకుల వల్ల ఇక్కట్లు

కోటబొమ్మాళి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివారు ప్రాంత భూములకు సాగు నీరందించే ఉద్దేశంతో శ్రీపురం ఎత్తిపోతల పథకానికి అనుబంధంగా ఏర్పాటు చేసిన భూగర్భ పైప్‌లైన్లు పాడవడంతో లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరడం లేదు. సుమారు 1000 ఎకరాలకు నీరిచ్చే ఉద్దేశంతో 2004లో రూ.8 కోట్ల వ్యయంతో శ్రీపురం పథకాన్ని ఏర్పాటు చేశారు. శివారు గ్రామాలైన ఊడికలపాడు, దుర్గంపేట, ఉప్పరపేట తదితర గ్రామాలకు చెందిన పొలాలకు సాగునీరు రాకపోవడంతో రైతులు అప్పటి, ఇప్పటి మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లగా సంబంధిత అధికారులతో చర్చించి చీపుర్లపాడు పంచాయతీ ఊడిగలపాడు ఎర్రబందకు నేరుగా సాగునీరు వెళ్లేలా 2016లో రూ.20 లక్షలతో శ్రీపురం ఎత్తిపోతల పథకం నుంచి ఊడికలపాడు ఎర్రబంద వరకు భూమిలో నుంచి పైపులైన్లు వేశారు. దీంతో 2016 నుంచి 2018 ఖరీఫ్ సీజన్ వరకు సాగు నీరు పుష్కలంగా అందడంతో ఆయా గ్రామాల రైతులు మెరక పొలాల్లో కూరగాయలు, వరి సాగు చేసుకున్నారు. 2019లో ఆ పైపులైన్లు పాడవగా సంబంధిత అధికారులు, వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకునేనాథుడే కరువయ్యారు. దీంతో గడచిన ఐదేళ్ల వైసీపీ హయాంలో సాగునీరందక మరలా రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



శ్రీపురం ఎత్తిపోతల పథకం


నీరు రాక పిచ్చిమొక్కలతో నిండిన యూటీ

గంజాయితో ముగ్గురు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

పలాస, జూలై 10(ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై గంజాయిని అమ్ముకోవడానికి యత్నించిన ముగ్గుర్ని అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. గురువారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కాశీబుగ్గ పట్టణం పద్మనాభపురం కాలనీకి చెందిన మామిళ్ల మల్లేశ్వరరావు, తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లాకు చెందిన దుర్గం రఘుకుమార్, గోదారి స్వామి విజయవాడలోని ఓ కేటరింగ్ షాపులో పనిచేసేవారు. వీరికి గంజాయి తాగే అలవాటు ఉంది. పూరిలో జరిగిన జగన్నాథ రథయాత్రలో వీరు ముగ్గురు పాల్గొని తిరిగి మల్లేశ్వరరావు ఇంటిలో మకాం పెట్టారు. గంజాయి తాగడంతోపాటు అమ్ముకొని డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. దీంతో బరంపురం (ఒడిశా)లో రెండు కిలోల గంజాయి కొనుగోలు చేసి కాశీబుగ్గ చేరుకున్నారు. అనంతరం వాటిని విజయవాడ తీసుకువెళ్లేందుకు యత్నిస్తున్న క్రమంలో ఆ ముగ్గురు ద్విచక్ర వాహనంపై వెళ్తూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని, వారి నుంచి గంజాయి, ద్విచక్రవాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి


మహేష్(ఫైల్)

మెళియాపుట్టి, జూలై 10(ఆంధ్రజ్యోతి): గొప్పిలి గ్రామానికి చెందిన నౌగాపు మహేష్(11) విద్యుత్ షాక్‌కు గురై గురువారం మృతి చెందాడు. ఇంటిమేడపై ఆడుకుంటూ సబ్‌స్టేషన్ నుంచి వస్తున్న 11కేవీ విద్యుత్ వైరు పట్టుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మహేష్ స్థానిక ప్రాథమిక పాఠశాల్లో ఐదో తరగతి చదువుతున్నాడు. నాలుగు నెలలు కిందటే తండ్రి నౌగాపు చంద్రరావు మృతి చెందగా.. తల్లి లక్ష్మి టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. మహేష్‌కి మూడో తరగతి చదువుతున్న చెల్లెలు వర్షిణి ఉంది.

సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌కు వెళ్లి వస్తుండగా..

- లారీ ఢీకొని దివ్యాంగ మహిళ మృతి.. నలుగురికి గాయాలు

జలుమూరు (సారవకోట), జూలై 10(ఆంధ్రజ్యోతి): వాళ్లంతా దివ్యాంగులు నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో సదరంలో రీవెరిఫికేషన్ ఆటోలో వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా సారవకోట మండలం చిన్నకిట్టాలపాడు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ధర్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన రాంబాన అమ్మన్న (65) మృతిచెందగా.. ఆటో నడుపుతున్న దువ్వారి సంతోష్ కుమార్, రాంగాల వరహాలు, దువ్వారి భారతి, దువ్వారి తులసీ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సాయంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన తర్వాత మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అంబులెన్స్‌లో నరసన్నపేట దాటిగానే అమ్మన్నమ్మ మృతిచెందారు. గాయపడినవారిలో ఇద్దరి పరిస్థితి విషయంగా ఉంది. ఆసుపత్రిలో క్షతగాత్రులను జలుమూరు ఎస్ఐ అశోక్‌బాబు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నరసన్నపేట ఆసుపత్రిలో సదరంకు సమయానికి వైద్యులు రాకపోవడంతో.. ఉదయం నిర్వహించాల్సిన పరీక్షలు మిట్టమధ్యాహ్నం నిర్వహించారు. ఇంటికి వెళ్లే ఆదరబదరాలో ఈ ప్రమాదం జరిగింది.

తెప్పలవలసలో ఒకరు ఆత్మహత్య

రణస్థలం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తెప్పలవలస గ్రామానికి చెందిన ఎం.చిన్నారావు (45)గురువారం ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. జేఆర్‌పురం పోలీసుల కథనం మేరకు.. చిన్నారావుకు అప్పులు ఎక్కువకావడంతో గురువారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ చిన్నారావు మృతిచెందాడు. చిన్నారావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

బాలిక అదృశ్యం

ఎచ్చర్ల, జూలై 10(ఆంధ్రజ్యోతి): బుడగట్లపాలెం గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు ఆమె తండ్రి అంబటి పరసయ్య గురువారం పోలీసులకు ఫిర్యాదుచేశాడు. కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఆమె ఈనెల ఐదో తేదీన కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం బాలికకు ఫోన్ చేయగా స్నేహితురాలి ఇంటి వద్ద ఉన్నానని పేర్కొందని తెలిపారు. తర్వాత ఇంటికి చేరలేదని చెప్పారు. ఈ మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

ఉద్యోగాలిప్పిస్తామంటూ..

- ఇద్దరు వ్యక్తుల నుంచి డబ్బులు వసూలు చేసిన మహిళ
- ఎన్నాళ్లయినా ఇవ్వకపోవడంతో నిలదీసిన బాధితులు
- తనపై హత్యాహత్నం చేశారంటూ మహిళ హల్‌చల్

పాతపట్నం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలిప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసిన ఓ మహిళ తనపై హత్యాహత్నం జరిగిందంటూ చేసిన ప్రచారం కలకలం రేపింది. ఎస్ఐ బి.లావణ్య తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. సదరు మహిళ పాతపట్నం సహారవీధిలో నివాసం ఉంటోంది. ఈ మహిళ భర్త కర్నూలులో సెర్ప్‌లో పనిచేస్తున్నారు. ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి సెరీకల్చర్‌లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై ఉద్యోగాలిప్పిస్తానంటూ ఈమె రూ.1.50 లక్షలు తీసుకున్నట్లు చెబుతున్నారు. అయితే కాలం గడుస్తున్నా ఉద్యోగాలివ్వకపోగా.. డబ్బులు కూడా వెనక్కి ఇవ్వకపోవడంతో ఆ ఇద్దరు వ్యక్తులు సదరు మహిళ ఇంటికి వెళ్లి నిలదీశారు. దీంతో తనపై వారు హత్యాహత్నం చేశారంటూ ఆమె హల్‌చల్ చేసింది. పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు ఈ ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవాల పరిశీలన అనంతరం కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ


అంపలాంలో అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పోలాకి, జూలై 10(ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని అంపలాం ఉన్నత పాఠశాలలో గురువారం ఆ గ్రామపెద్దల. హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. 2009-10 పదో తరగతి చుదువుకున్న విద్యార్థులు పాఠశాలకు ఈ విగ్రహాన్ని వితరణగా అందించినట్టు హెచ్‌ఎం సదాశివుని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో విద్యాకమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులను వారి సిబ్బంది అభినందించారు.

రిటైర్డు వీఆర్వో సంఘ జిల్లా అధ్యక్షుడిగా రామ్మోహన్‌నాయుడు

నరసన్నపేట, జూలై 10(ఆంధ్రజ్యోతి): రిటైర్డు వీఆర్వో సంఘ జిల్లా అధ్యక్షుడిగా కోమర్తి రిటైర్డు వీఆర్వో కింజరాపు రామ్మోహన్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జిల్లాకార్యవర్గ సమావేశంలో శ్రీకాకుళంలో జరిగింది. రామ్మోహన్ ఎంపికపై సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మధ్యవర్తిత్వంతో కేసులు రాజీ



మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి నిర్మల

టెక్కలి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం వల్ల కేసులు రాజీ చేసుకోవచ్చునని, ఇందుకు న్యాయవాదులు సహకరించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారులు బి.నిర్మల అన్నారు. గురువారం కోర్టు ప్రాంగణంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో న్యాయాధికారి పాల్గొని మాట్లాడారు. వివాహానికి సంబంధించిన కేసులు, గృహహింస కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, సివిల్ కేసులు, రాజీకి అనుకూలమైన క్రిమినల్ కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించబడునని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు


స్వామివారిని దర్శించుకుంటున్న దువ్వాడ శ్రీధర్, మునిసిపల్ చైర్మన్ గిరిబాబు, భక్తులు

పలాస, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకలు స్థానిక శివాజీనగర్ శిర్డీసాయిబాబా సంస్థాన్ ట్రస్టు నిర్వహిస్తున్న బాబా మందిరం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. సంస్థ ధర్మకర్త దువ్వాడ శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం శ్రీధర్, రమ దంపతులు బాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మందిర ప్రాంగణంలో మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం సాయం సంధ్యాహారతి, రాత్రి శేజారతి ఇచ్చారు. గురుపౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, వైద్యుడు దువ్వాడ జీవితేశ్వరరావు, ప్రజాసంఘాల నాయకుడు దువ్వాడ శ్రీకాంత్, మరడ భాస్కరరావు, గొర్లె వేణుగోపాల్, మల్లా కామేశ్వరరావు, మల్లా భాస్కరరావు, బోర భగవతి, కూన హేమాచలం, దువ్వాడ అన్నాజీరావు, నవీన్‌కుమార్ చౌదిరి, జినగ రామ్‌నరేష్‌తో పాటు పట్టణానికి చెందిన ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చదువు ఆర్థిక భారం కాకూడదు


మాట్లాడుతున్న కరస్పాండెంట్ కవిటి భారతి

కాశీబుగ్గ, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువు అనేది ఆర్థిక భారం కాకూడదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆలోచనతోనే ఇంట్లో ఎంత మంది చదువుతుంటే వారందరికీ తల్లికి వందనం పథకం ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందని కరస్పాండెంట్ కవిటి భారతి అన్నారు. గురువారం చినబాడాంలో గల శ్రీసాయి శిరీష హైస్కూల్లో పేరంట్-టీచర్- మీటింగ్ ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాక్రిష్ణ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డు అధ్యపకులు గోపాల్‌రావు, రిటైర్డు హెచ్‌ఎం ఉపేంద్ర, పేరంట్స్-విద్యార్థి-టీచర్‌కు ఉన్న సత్సంబంధాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పాఠశాల పూర్వ విద్యార్థులు ప్రియాంక, మోహిని పాఠశాలలో చదువుకున్న అనుభావాలు తల్లిదండ్రులతో కలిసి పంచుకున్నారు. అనంతరం తల్లిదండ్రులకు పాదపూజ, ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కవిటి రేణుకేశ్వరరావు, తల్లిందండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాయిదా పడిన నారాయణవలస సంత వేలం

కోటబొమ్మాళి, జూలై 10(ఆంధ్రజ్యోతి): నారాయణవలస గురువారం వారపు సంత పాటదారులు ఎవ్వరు హాజరు కాకపోవడంతో ఈ నెల 12వ తేదీకి వాయిదా వేసినట్టు ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వేలం పాట కోసం ఎదురుచేశామని ఎవ్వరు రాకపోవడంతో వాయిదా వేశామన్నారు. డిప్యూటీ ఎంపీడీవో జే. ఆనందరావు, కార్యదర్శి పి.రనిష, జూనియర్ అసిస్టెంట్ కె. రామక్రిష్ణ పాల్గొన్నారు.

వంశధార నదిపై వంతెన నిర్మాణానికి కృషి


ఉప్పరపేట వంతెన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి) చోడవరం రేవు నుంచి పురుషోత్తపురం వరకు వంశధార నదిపై వంతెన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఉప్పరపేట వద్ద 84 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన వంతెనను గురువారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వంశధారపై వంతెన నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు తయారుచేస్తే సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పర్లాం ఇసుక ర్యాంపు నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగించినందున ఉప్పరపేట వద్ద వంతెన 2023 ఆగస్టు 14 కూలిపోయిందన్నారు. అయితే అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొట్టమొదటిసారిగా ఈ వంతెనకు 84 లక్షలు రూపాయలు మంజూరు చేసి పనులు పూర్తి చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమం సాధ్యమన్నారు. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమపథకాలు అమలు తీరును వివరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సత్యన్నారాయణ, డీఈ తిరుపతిరావు, జేఈ సరోజ, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఎంపీపీ వాన గోపి పార్టీ నాయకులు వెలమల రాజేంద్రనాయుడు, కన్వినరు బగ్గు గోవిందరావు, పర్లాం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు కింజరాపు సత్యం, టిడిపి నాయకులు దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, కొబగాపు ఉత్తరుడు, తర్ర బలరాం, దేవ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహగిరి ప్రదక్షిణ చేసివస్తూ..

(ఐదో పేజీ తరువాయి)


విలపిస్తున్న ఉదయ్ తల్లి లక్ష్మి, కుటుంబ సభ్యులు

జాతీయ రహదారిపై బ్రిడ్జిపైకి చేరుకుంటుండగా డివైడర్‌ను ఢీకొట్టారు. రావాడ ఉదయ్ తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చొన్న స్నేహితుడు తుర్ల చిన్నారావుకు తీవ్రగాయాలయ్యాయి. చిన్నారావును చికిత్స కోసం తగరపువలస ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఉదయ్ మృత దేహాన్ని సుందరపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సమాచారం అందుకొన్న కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు రావాడ లక్ష్మి, రమణయ్య కుమారుని మృత దేహం వద్ద కన్నీరుమున్నీరయ్యారు. ఉదయ్ డిగ్రీ పూర్తి చేశాడు. పెళ్లి చేయడానికి తల్లిదండ్రులు ప్రయత్నాలు చేస్తున్నారు. అంతలోనే ఆ కుటుంబానికి కోలుకోలేని కష్టం వచ్చింది. ఉదయ్‌కు చెల్లి సంధ్య ఉంది. సీఐ దుర్గా ప్రసాదరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి.. డివైడర్ అవతలికి దూసుకెళ్లిన వ్యాన్

- బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరి దుర్మరణం.. మరొకరికి గాయాలు

రణస్థలం, జూలై 10(ఆంధ్రజ్యోతి):రణస్థలం వద్ద జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్ సమీపంలోగల జాతీయ రహదారిపై శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న వాహనం అదుపు తప్పి అవతలి మార్గం వైపు దూసుకెళ్లింది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిలో ఒకరు దుర్మరణం పాలవ్వగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. జేఆర్‌పురం పోలీసుల కథనం మేరకు.. రాజాంకు చెందిన పరమేశ్వరరెడ్డి (31), శ్రీకాకుళం హుడా కాలనీకి చెందిన కనకరాజు ద్విచక్రవాహనంపై శ్రీకాకుళం వైపు వెళ్తున్నారు. జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్ సమీపంలో శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న ఐషర్ వాహనం అదుపు తప్పి డివైడర్ దాటి అవతలి మార్గంలో వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఘటనా స్థలంలోనే ధర్మల పరమేశ్వర్ రెడ్డి మృతిచెందారు. కనకరాజు అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు జేఆర్‌పురం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. గాయపడిన కనక రాజును శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. పరమేశ్వర్‌రెడ్డితో పాటు కనకరాజు మెడికల్ రిప్రజెంట్లుగా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వస్తుండగా ప్రమాదం జరిగింది. జేఆర్‌పురం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

15న పెన్షనర్ల ధర్నా విజయవంతం చేయాలి

టెక్కలి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 15న రిటైర్డు ఉద్యోగులు దేశవ్యాప్తంగా నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రోణంకి రామచంద్రరావు, ఎ.ధర్మారావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వేలిడేషన్ ఎమాండెంట్‌ను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం 8వ పే కమిషన్ నియమించాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే పే కమీషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి, జూలై 10(ఆంధ్రజ్యోతి): టెక్కలి టౌన్ ఫీడర్-1, 2, రావివలస 11 కేవీ విద్యుత్ లైన్ పరిధిలో మెంటినెన్స్ పనులు చేయనున్నందున శుక్రవారం ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ జి.శంకరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

- వజ్రపుకొత్తూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వజ్రపుకొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో మెయిటెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తూన్నట్టు ఈఈ యజ్ఞేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తూన్నామని ప్రజలు సహకరించాలని కోరారు.
- కొత్తూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి) కొత్తూరు విద్యుత్తు సబ్‌స్టేషన్ 33/11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని చెట్ల కొమ్మలు కొట్టడం, ఇతర మరమ్మతు పనులు చేపట్టనుండడంతో శుక్రవారం ఉదయం 8 గంటలు నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ జి.శంకరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తూరు, కర్లెమ్మ, మహాసింగి, పారాపురం తదితర గ్రామాలకు విద్యుత్తు ఉండదని ఆయన అన్నారు. ఈ గ్రామాల పరిధిలో ఉన్న రైసుమిల్లు, పాలకేంద్రాలకు విద్యుత్ నిలుపవేయబడనున్నట్టు వినియోగదారులు సహకరించాలని కోరారు.
- రణస్థలం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఎర్రవరం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 కేవీ తెప్పలవలస ఫీడర్ మరమతుల నేపథ్యంలో తెప్పలవలస, సీతారామపురం, నీలంపేట, చినపట్నానపేట, చిల్లపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

పాతపట్నం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను ఎండగెట్టాలని వైసీపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక కేఎస్‌ఎం ప్లాజాలో గురువారం జరిగిన వైసీపీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో అసత్య ప్రచారాలతో ఎన్నికల విజయాలు సాధించగలిగారన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ.. గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తమ్మినేని సీతారాం, కె.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

టెక్కలి, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టున గల సంతోషిమాత ఆలయ హుండీని గురువారం దేవదాయశాఖ ఈవో జి.గురునాథరావు, టీపీ మనస్వి సమక్షంలో లెక్కించారు. రూ.33,850 హుండీ ఆదాయం సమకూరిందని వారు తెలిపారు.

14న ఆలయ భూముల కౌలు హక్కుకు వేలం

టెక్కలి, జూలై 10(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మణ బాలాజీ దేవస్థానానికి సంబంధించి మూడేళ్ల (2025–28) పాటు టెక్కలి మేజర్ పంచాయతీ పితాపురంలో గల 4.55 ఎకరాల పల్లపు భూముల కౌలు హక్కులకు ఈ నెల 14న కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్టు ఈవో టీపీ మనస్విని తెలిపారు. వేలంపాటలో పాల్గొన్న వారు వెయ్యి రూపాయలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చునని తెలిపారు.

స్థలం చూపండి

పోలాకి, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తడిచెత్త, పొడిచెత్తను వేసేందుకు స్థలం చూపాలని తహసీల్దార్ కార్యాలయానికి ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేకపోతుందని పోలాకి సర్పంచ్ మజ్జి లక్ష్మీరమణమ్మ తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీపీ ముద్దాడ దమయంతిని నిలదీశారు. పోలాకి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన గురవారం జరిగింది. ఎంపీపీ ముద్దాడ దమయంతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షులు తాతారావు, కోట అప్పారావు, సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంశధార ఈఈగా మురళీ

నరసన్నపేట, జూలై 10(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట వంశధార డివిజన్ కార్యాలయ ఈఈగా ఎం.మురళీ మోహనరావును నియమిస్తూ జలవనరులు శాఖ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ మేరకు గురువారం ఈఈగా బాధ్యతలను స్వీకరించారు. శ్రీకాకుళం కార్యాలయంలో పనిచేస్తున్న మురళీమోహనరావు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. గతంలో నరసన్నపేట సబ్‌డివిజన్ కార్యాలయంలో డీఈఈగా పనిచేశారు.

తడి, పొడి చెత్తను సేకరించాలి

నరసన్నపేట, జూలై10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్తసేకరించే సమయంలో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలని జిల్లా పంచాయతీ అధికారణి సౌజన్యభారతి సూచించారు. గురువారం జమ్ము గ్రామంలో ఇంటింటా చెత్తసేకరణ పక్రియను పరిశీలించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, డ్రైనేజ్ నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాన గోవిందరాజులు, పంచాయితీ కార్యదర్శి కె.శ్రావణి, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

గృహహక్కు లేదు.. నగదూ లేదు

(ఐదో పేజీ తరువాయి)

డబ్బులైనా తిరిగి ఇవ్వాలని.. లేదంటే ధ్రువపత్రాలైనా అందించాలని కోరుతున్నారు.

- నాలుగు కేటగిరీలుగా..

అప్పట్లో లబ్ధిదారులను నాలుగు కేటగిరీలుగా విభజించారు. 'కేటగిరి- ఏ' కింద లబ్ధిదారుడు గృహనిర్మాణ సంస్థ నుంచి అప్పుగా తీసుకొని ఉండి మృతిచెందితే.. వారి వారసులకు పట్టా అందిస్తారు. ఓటీఎస్ పేరిట గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు ఉంటే రూ.10వేలు, మునిసిపాలిటీల్లో రూ.15వేలు, కార్పొరేషన్‌లో రూ.20వేలు చొప్పున వసూలు చేశారు. 'కేటగిరి-బి' కి సంబంధించి రుణం తీసుకున్న వ్యక్తి నుంచి ఇతరులు ఆ ఇంటిని కొనుగోలు చేసినా క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశ మిచ్చారు. ఇందుకుగాను గ్రామీణ ప్రాంతాల్లో రూ.20వేలు, మునిసిపాలిటీల్లో రూ.30వేలు, కార్పొరేషన్ పరిధిలో రూ.40వేలు వసూలు చేపట్టారు. 'కేటగిరి - సి'కి సంబంధించి ప్రభుత్వ రుణం పొందకుండా.. సొంతంగా ఇంటిని నిర్మించుకున్నవారి నుంచి రూ.10వేలు చొప్పున వసూలు చేశారు. 'కేటగిరి- డి' కింద ప్రభుత్వం పట్టా ఇచ్చిన తరువాత.. దానిని అమ్ముకుంటే కొనుగోలు చేసిన వారి దగ్గర.. గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేలు, మునిసిపాలిటీల్లో రూ.15వేలు, కార్పొరేషన్‌లో రూ.20వేల వంతున వసూలు చేశారు.

ఇదీ పరిస్థితి..

జిల్లావ్యాప్తంగా అధికారులు, సచివాలయ సిబ్బంది బలవంతంగా వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. జిల్లాలో 1983-2011 మధ్య 4 లక్షల మంది గృహ నిర్మాణ లబ్ధిదారులు ఉన్నట్టు అప్పట్లో గుర్తించారు. వీరి వద్ద నుంచి రూ.120 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించారు. కానీ చాలామంది ఓటీఎస్‌పై ఆసక్తి చూపలేదు. అయినప్పటికీ లబ్ధిదారులపై ఒత్తిడి చేసి.. జిల్లావ్యాప్తంగా సుమారు రూ.10 కోట్లు వసూలు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఓటీఎస్ విషయంలో లబ్ధిదారులే కాదు.. అధికారులు, సచివాలయ సిబ్బంది అందరూ బాధ్యులే. ఇంతవరకూ లబ్ధిదారులకు సరైన డాక్యుమెంట్లు ఇవ్వలేదు. పేదల పింఛన్లు తొలగిస్తామని, సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని అప్పట్లో బెదిరించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ముడిపెట్టారు. రుణాలు తీసుకున్నవారు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందేనని ఒత్తిడి పెంచారు. డ్వాక్రా గ్రూపుల్లో ఉన్నవారితో రుణాలు ఇప్పించి మరీ రిజిస్ట్రేషన్లు చేయించారు. అయితే ఇలా రిజిస్ట్రేషన్లు చేసుకున్నా చాలామందికి ఇప్పటికీ డాక్యుమెంట్లు ఇవ్వలేదు. మరికొందరికి ఇచ్చినా అందులో వివరాలు తప్పుగా నమోదయ్యాయి. అప్పట్లో టార్గెట్లు పూర్తిచేయని సచివాలయ సిబ్బందిపై వేటు కూడా వేసిన సందర్భాలున్నాయి. ఇంత చేసినా లబ్ధిదారులకు మాత్రం న్యాయం చేయలేకపోయారు. ఆయా బాధితులంతా తమకు న్యాయం చేయాలంటూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. 'మీ-కోసం' కార్యక్రమంలో చాలామంది వినతులు అందజేస్తున్నారు.